క్లుప్తంగా

గణనాథుడికి ప్రత్యేక పూజలు



నర్సంపేట : పట్టణంలోని వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటీల బాధ్యులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గణనాథుడికి పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. 11వ వార్డు పరిధిలోని అంగడి రోడ్డు శివనగర్‌లో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోని వినాయకుడికి మహిళా భక్తులు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సిద్దార్థనగర్‌లో మహిళలు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా నిమజ్జనం



దుగ్గొండి/నెక్కొండ : దుగ్గొండి, నెక్కొండ మండలాల్లోని పలు గ్రామాల్లో గణపతి నవ రాత్రి ఉత్సవాలు గురువారం 9వ రోజుకు చేరాయి. కాగా ఈసారి 10వ రోజు శుక్రవారం కావడం, 7న సూర్యగ్రహణం ఉండటంతో కొన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలకు గురువారం రాత్రి నిమజ్జనం చేశారు. గణపతి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలు అలరించింది.

ఓనం వేడుక



రాయపర్తి : మండల కేంద్రంలోని శ్రీమహాత్మ హైస్కూల్‌లో కేరళ సాంప్రదాయం ప్రకారం ఓనం పండుగను గురువారం వేడుకగా నిర్వహించారు. పూలతో వివిధ రకాల ముగ్గులు వేసి వాటి ప్రాధాన్యతను చాటారు. పూల ప్రాశస్త్యాన్ని, వాటి సుకుమారతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సరికొండ కృష్ణారెడ్డి, స్కూల్ డైరెక్టర్ కుంట సరిత రమేశ్, కేరళ ఉపాధ్యాయులు కిరణ్, స్మిజ, జానీకాలు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



వర్ధన్నపేట : పట్టణంలోని రెండో వార్డులో సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే నాగరాజుకు కాలనీవాసుడు అనిమిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులో చాలాకాలంగా రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, వర్షం కురిస్తే నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

8న ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి

నర్సంపేట : ఈనెల 8న ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొల్లం రామ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో జాతీయ, రాష్ట్ర నాయకుడు ముడుసు రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల రవి, జిల్లా యూత్ అధ్యక్షుడు ఉసిల్ల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జీఓలో అందరు ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉన్న క్రమంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడికి నిర్ణయించినట్టు తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జీఓను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేషన్ డీలర్ల బంద్‌కు మద్దతు

నర్సంపేట : రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం తలపెట్టిన బంద్‌కు తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, నర్సంపేట కన్వీనర్ పంజాల వెంకట్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతి లక్ష్మీనారాయణ మద్దతు ప్రకటించారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఐక్యవేదిక బాధ్యులు సంగెం మహేందర్, ఏడుకొండ సదానందం, కె.గవర్ సింగ్, జన్ను రవి, జెస్ శ్రీనివాస్, భూపతి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం చెల్లించాలి

పర్వతగిరి: ఎన్నికల హామీ మేరకు రేషన్ డీలర్లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం, క్వింటాకు రూ.300 కమీషన్ ఇవ్వాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గడ్డం బాబు, ప్రధాన కార్యదర్శి లూనావత్ లక్ష్మియా కూబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నేడు (శుక్రవారం) తలపెట్టిన బంద్‌కు సహకరించాలని కోరారు.

ఆధునిక సాగుపై రైతుల ఆసక్తి

● డ్రోన్‌తో 10 నిమిషాల్లో ఎకరాకు పిచికారీ

నెక్కొండ : రైతులు ఆధునిక వ్యవసాయం దిశగా ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల కాలంలో పంటల సాగులో యంత్రాల వినియోగం భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనం. ఒకప్పుడు దున్నకాలు, వరినాట్లు, కోతలు, మార్పిళ్లు, మందుల పిచికారీ చేయాలన్నా.. పశువులు, ఎడ్లబండ్లు, కూలీల అవసరం తప్పనిసరి. కాగా సాగు పద్ధతుల్లో వచ్చిన మార్పులతో దున్నకాలకు ఇనుప వీల్స్, ట్రాక్టర్లు, వరి నాట్లకు రైస్ ట్రాన్స్‌ప్లాంటర్, డ్రమ్ సీడర్, వీడర్స్, మందు పిచికారీకి డ్రోన్లు, స్ప్రేయర్లు, ధాన్యం తూర్పార పట్టేందుకు యంత్రాలు అందుబాటులో వచ్చాయి.

మండలంలో రైతులు ఖరీఫ్‌లో పత్తి, వరి, మొక్కజొన్న, మిరప, పంటలతోపాటు కూరగాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలతోపాటు పత్తి, మొక్కజొన్న పంటలు ఏపుగా పెరిగాయి. అధిక వర్షాలకు పంట రంగు మారుతుండడంతో మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే కూలీల కొరత, పెరిగిన పెట్టుబడులతో రైతులు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ క్రమంలో కొంత మంది రైతులు డ్రోన్‌ల సహాయంతో పంటలకు మందులు పిచికారీ చేయిస్తున్నారు. కొంత మంది డ్రోన్‌లు అద్దెకు నడుపుతున్నారు. డ్రోన్‌లు ఎకరా పంటను కేవలం పది నిమిషాల్లో మందులను పిచికారీ చేస్తుంది. నేరుగా మొక్కలపై మందులను పిచికారీ చేయడంతో మందు వృధా కావడం లేదు. ఇద్దరు కూలీలు అవసరమయ్యే పనిని ఒక్క డ్రోన్ తక్కువ సమయంలో పూర్తి చేస్తుంది.



పురుగుల మందు పిచికారీ చేస్తున్న డ్రోన్



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న రైతులు

ఎకరాకు పది నిమిషాలే



డ్రోన్ సాహాయంతో ఎకరాలకు మందు పిచికారీ చేయడానికి పది నిమిషాలు పడుతుంది. నాకున్న మూడెకరాల్లో కూరగాయ పందిరి సాగు, రెండెకాలు విడిగా కూరగాయల సాగు చేస్తున్నాను. మిగిలిన 6 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి సాగు చేస్తున్నా.. 11 ఎకరాలలో పంట సాగుకు సరిపడా కూలీలు సమాయినికి అందుబాటులో ఉండడంలేదు.

\- తమ్మిశెట్టి కోటేశ్వర్, రైతు చంద్రుగొండ

డ్రోన్ స్ప్రేతో రైతులకు ఊరట



వ్యవసాయ పనులు చేయడానికి కూలీలు దొరకడం లేదు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకరావలిన్న పరిస్థితులు ఏర్పడింది. డ్రోన్ స్ప్రే ద్వారా ఒక ఎకరం పంటను 10 నిమిషాల్లో 10 లీటర్ల నీటితో స్ప్రే చేయవచ్చున్నారు. దీంతో సమయం ఆదా అవుతుందని, కూలీల సమస్య తీరనుంది. కిరాయి తీసుకోవడంతో ఖర్చులు కూడా తగ్గుతుంది.

\-ఎగిడి నాగరాజు, ఏఓ

యూరియా కోసం తప్పని తిప్పలు



సంగెం: యూరియా కోసం గుమిగూడిన రైతులు



నల్లబెల్లి : గద్దలను చూపుతున్న సౌజన్య

● రాత్రివేళలోనూ ఎదురు చూపులు

నర్సంపేట/సంగెం : నర్సంపేట, సంగెం మండలాల్లో యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. రాత్రివేళలోనూ బారులు తీరిన దుస్థితి పాపయ్యపేట సొసైటీ గోదాం వద్ద చోటు చేసుకుంది. యూరియా బస్తాల లారీ వచ్చిందని తెలియడంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు చేరుకుని గురువారం తెల్లవారుజాము వరకు బారులుదీరారు. కాగా 444 బస్తాలు మాత్రమే రాగా గురువారం ఉదయం రైతులకు ఒకటి చొప్పున పోలీస్ బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. సంగెం సొసైటీకి యూరియా వస్తున్నట్టు తెలిసి రైతులు భారీగా చేరుకోగా పోలీసు బందోబస్తు నడుమ ఒక్కో బస్తా చొప్పున అందజేశారు.

సంగెం : మండలంలోని రైతులను యూరియా కొరత వేదిస్తోంది. అరకొరగా సరఫరా అవుతుండడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. మండల కేంద్రంలోని సొసైటీకి యూరియా వస్తోందని తెలిసి గురువారం ఉదయం నుంచి పలు గ్రామాల రైతులు క్యూలైన్‌లో చెప్పులు ఉంచి వేచి ఉన్నారు. మధ్యాహ్నానికి 444 బస్తాల యూరియా రాగా ఎరువుల కార్డులతో వచ్చిన రైతులకు పోలీసుల పహారా మధ్య ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. పలువురు రైతులకు యూరియా దొరకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

నాసిరకం యూరియా పంపిణీ

నల్లబెల్లి : శనిగరం రైతు ఆగ్రోస్ కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన యూరియా దుమ్ముతో కూడుకుందని పలువురు రైతులు మీడియాకు తెలిపారు. యూరియా గడ్డలు కట్టి బండరాళ్లలా ఉందని రైతులు చూపారు. ప్రభుత్వం యూరియా పంపిణీలో నాణ్యత పాటించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్

నెక్కొండ : అసంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ కోరారు. అలంకానిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని బొల్లికొండలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. మురుగు కాల్వల శుభ్రత, వర్షపు నీటి తొలగింపు, బ్లీచింగ్ చల్లడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు సుమన్, అఖిల్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్

అదనపు గదుల పరిశీలన



నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం పరిశీలించారు. గదుల నిర్మాణానికి కావాల్సిన అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సదుపాయాల గురించి కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల విద్యార్థులు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేటకు విద్యావరంగా ఏ అవకాశం వచ్చినా అందిపుచ్చుకుని ముందుకు తీసుకెళ్లానని, అవసరమైతే ప్రభుత్వంతో మాట్లాడి అవకాశాలను ఇంకా మెరుగుపరుస్తానని ఆయన తెలిపారు.

ప్రభుత్వానికి ముందుచూపు లేక ఇబ్బందులు

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొరత స్పష్టంగా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా క్యూలైన్లు, రోడ్లపై రైతులు కనిపిస్తున్నారని తెలిపారు. నర్సంపేట నియోజకవర్గంలో సమస్య తీవ్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ అసమర్థ విధానాల వల్ల రైతులు రోడ్డు పాలు కావాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. అర్ధ రాత్రి వేళల్లో పీఏసీఎస్ సెంటర్ల వద్ద ఒక్క బస్తా యూరియా కోసం నెల రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్న దుస్థితి నెలకొందన్నారు. రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుండగా మంత్రుల నుండి కనీస స్పందన లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి యూరియా కొరతపై సమీక్షించి జిల్లాకు, నియోజకవర్గానికి డిమాండ్ మేరకు అందించాలని డిమాండ్ చేశారు.

ముందస్తు గురుపూజోత్సవం



నర్సంపేట : జెడ్పీ హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, గీసుకొండ తదితర మండలాల్లోని పలు స్కూళ్లలో గురువారం ముందస్తుగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. పలు స్కూళ్లలో ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితర ప్రముఖులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : ఉపాధ్యాయురాలు రజితకు పురస్కారం అందజేస్తున్న ఎంఈఓ శ్రీధర్

ఘనంగా వన్యప్రాణి దినోత్సవం



పర్వతగిరి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ టీజీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ వన్యప్రాణి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థినులు పోస్టర్లు, చిత్రాల, నినాదాలతో వన్యప్రాణి సంరక్షణపై సందేశాలు అందించారు. వన్యప్రాణుల ప్రాధాన్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర వివరించారు. వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్‌రావు

వర్ధన్నపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎన్నికల మండల ప్రభారి జలగం రంజిత్‌రావు కోరారు. మండలంలోని ఇల్లందలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేడంలో విఫలమైందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీఎస్ డైరెక్టర్ బూడిద రమేశ్, రాష్ట్ర నాయకుడు పంజా వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, జిల్లా కార్యదర్శి జడ సతీశ్, జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి సంపత్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మైస రాము, నాయకులు రాయపురపు కుమారస్వామి, నాంపల్లి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ ఎంపీటీసీ పరిధిలోని పార్టీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకుడు మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతం మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోయి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఎంపీటీసీలను గెలుచుకుని ఎంపీపీని కై వసం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి జాటోతు రవి, మండల ఉపాధ్యక్షులు పాయలి యాకన్న, అధ్యక్షుడు నంగునూరు శ్రీనివాస్, నారాయణపురం బూత్ అధ్యక్షుడు వీరన్న, రోళ్లకల్ బూత్ అధ్యక్షుడు జనగాం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

పురుగుల మందుల పిచికారీలో జాగ్రత్త

● ప్రజ్వల్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్

గీసుకొండ : పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజ్వల్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనుమలు శ్రీనివాస్ కోరారు. మండలంలోని మచ్చాపూర్‌లో రైతులకు గురువారం పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంట చేలకు పురుగుల మందు పిచికారీ చేసే సమయంలో తప్పనిసరిగా పీపీఈ కిట్లు ధరించాలని సూచించారు. లేనిపక్షంలో పురుగుల మందు ప్రభావంతో రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 113 మందికి ఉచితంగా కిట్లు పంపిణీ చేశామన్నారు. కిట్‌లో ఫుల్ ప్యాంటు, షర్టు, మాస్కు, బూట్లు, టోపీ, గ్లౌజులు, కళ్లద్దాలు ఉంటాయని చెప్పారు. అనంతరం ఆ సంస్థ టెక్నికల్ కోఆర్డినేటర్ మాట్లాడారు. పురుగుల మందుల పాకెట్లు, డబ్బాలపై ఉన్న సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ విభాగం మేనేజర్ అయేశా, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పీపీఈ కిట్లు అందిస్తున్న శ్రీనివాస్, తదితరులు

లారీ డ్రైవర్‌కు ఫిట్స్

వర్ధన్నపేట: డ్రైవింగ్ చేస్తుండగా లారీ డ్రైవర్‌కు హఠాత్తుగా ఫిట్స్ వచ్చింది. దీంతో సదరు లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి లారీ ఆపడంతో భారీ ప్రమాదం తప్పిన ఘటన వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కరీంనగర్ నుంచి ఒడిశాకు గ్రానైట్ లోడ్‌తో శుక్రవారం లారీ వెళ్తోంది. ఈ క్రమంలో డ్రైవింగ్ చేస్తుండగా లారీ డ్రైవర్ అజారుద్దీన్‌కు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీని రోడ్డు పక్కన ఆపడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. డ్రైవర్ అజారుద్దీన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

గాంధీ మార్గం అనుసరణీయం

● ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ అశోక్

నర్సంపేట : గాంధీ చూపిన అహింస మార్గం అనుసరణీయమని గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి మాసోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో పట్టణంలోని సిద్దార్థ స్కూల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్య్ర సంగ్రామం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ప్రజలు అహింసాయుత, సత్య మార్గాల్లో విజయం సాధించారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రజాపోరాటాలు, శాంతి ఉద్యమాలకు మహాత్ముడే ఆదర్శమన్నారు. యువతలో గాంధీతత్వం, అహింస సత్యమార్గాల వ్యాప్తికి కృషి చేయడానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని కోరారు. విద్యార్థులు, యువత గాంధీజీ ఆశయాలు, ఆలోచనలను, సిద్ధాంతాలను అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దార్థ విద్యాసంస్థల అధినేత ప్రభాకర్‌రెడ్డి, సైకాలజిస్ట్ సృజనారెడ్డి, కైరంకొండ సంతోశ్, బెజ్జంకి ప్రభాకర్, అశోక్, నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అశోక్, తదితరులు

శాంతియుతంగా నిమజ్జనం, శోభాయాత్ర నిర్వహించాలి



వర్ధన్నపేట : మండలంలో గణేశ్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు నేడు శాంతియుతంగా నిమజ్జనం, శోభాయాత్ర, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక ఎస్సై సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నిమజ్జనం, శోభాయాత్రలో తప్పనిసరిగా పలు సూచనలు పాటించాలని ఆయన వివరించారు. శోభాయాత్రలో డీజే సౌండ్ బాక్స్‌లను ఉపయోగించరాదని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని, విద్యుత్ తీగలు, వచ్చి పోయే వాహనాలను గమనించుకుంటూ యాత్రను నిర్వహించాలని, యాత్రలో అశ్లీల నృత్యాలు, మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పాటల్ని ప్రదర్శించరాదని పేర్కొన్నారు. శోభాయాత్రలో బాణాసంచా కాల్చడం నిషేధమని, నిమజ్జన సమయంలో నీటి వద్ద జాగ్రత్తలు పాటించాలని, నీటి వద్దకు చిన్న పిల్లలను రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి



దామెర : విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సామ్యానాయక్ కోరారు. దామెర, తక్కళ్లపహాడ్‌లో గురువారం పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. అనంతరం డీఈ మాట్లాడారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని స్టాటర్‌ను పొడి చేతులతో ముట్టుకోవాలని అన్నారు. వ్యవసాయ కలనెక్షన్ల వద్ద ఎర్తింగ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా చెట్ల కొమ్మలు విరగడం కరెంటు తీగలు తెగే ప్రమాదం ఉందన్నారు. దుర్ఘటనలు చోటు చేసుకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ గుర్రం రమేశ్, లైన్‌మెన్లు మనోహర్, గిరిబాబు, జేఎస్ఎంలు కృష్ణ, రమేశ్, రాజశేఖర్, అన్‌మ్యాన్డ్ వర్కర్లు రఘునందన్, రజనీకాంత్, వెంకటేశ్, రమేశ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

వర్ధన్నపేట : పట్టణంలోని 5వ డివిజన్ కౌన్సిలర్ బానోత్ అనిత శ్రీనివాస్ తల్లి బానోత్ కేలి మృతి చెందగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఆమె మృతదేహానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, 12వ డివిజన్ కౌన్సిలర్ పూజారి సుజాత రఘు, నాయకులు వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, సురేశ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 23వ వార్డుకు చెందిన వరంగంటి బుచ్చమ్మ గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రవి, పట్టణ ఉపాధ్యక్షుడు దేవండ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎలయ్యగూడెంలో..

మండలంలోని ఎల్లయ్యగూడెం గ్రామానికి చెందిన బొల్ల నర్సయ్య, జల్లిలో చెట్టబోయిన నర్సింహస్వామి మృతి చెందగా వారి మృతదేహాలకు మాజీ ఎంపీపీ జక్క అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ మంచోజు మనోజ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎదురబోయిన సాంబయ్య, బాషబోయిన రామలింగం, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి సాయం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.25 వేలు, మండల పంచాయతీ అధికారి శ్రీధర్ రూ.5 వేలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్దిరాజు కల్యాణి రూ.2 వేలు ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపాక రాజేందర్, సంఘం మండల అధ్యక్షుడు ముస్కు రాజు, నాయకులు గంగాడి అశోక్‌రెడ్డి, శ్రీరామోజు భిక్షపతి, గుజ్జుల నర్సయ్య, చాపర్తి నర్సయ్య, బుగ్గ బచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న ఎంపీఓ, తదితరులు